రేపటి సూర్యోదయం

-పి.ఎస్.నారాయణ

నా కళ్లు జిగేలుమన్నాయి.

ఎదురింటి మేడమీద మెరిసిన మెరుపుకు నేను ఉక్కిరిబిక్కిరి అయ్యాను. రెండురోజుల క్రితం కొత్తగా వచ్చారు. పిల్లాజెల్లా, జనంతో హడావుడి. సామాన్ని చిన్న లారీలో దింపారు. అంతా సర్దుకున్నట్లుగా నాలుగు రోజులకే నిశ్శబ్దమేర్పడింది వచ్చినవాళ్లంతా వెళ్లిపోయారు అన్నట్లుగా. కానీ ఆ మెరుపు అలాగే వుండిపోయింది నా కళ్లను వెలుగుతో నింపుతూ.

నిద్ర లేస్తూనే హడావుడిగా తలుపుతీసి మొట్టమొదటిసారిగా ఆ మేడమీదకే చూస్తాను. సూర్యుడిని చూస్తున్నంత భక్తిగా. అయిదు నిముషాలు పరీక్షగా చూపును కేంద్రీకరించి వుంచితే కిటికీలో నుండి అటూ ఇటూ ఆ గదుల్లో తిరిగే మెరుపు నాకు కనువిందు చేస్తుంది. నాకు తొమ్మిదిగంటలదాకా చిన్న చిన్నవి ఆ పనీ ఈ పనీ చేస్తూ కిటికీ వూచలు పట్టుకు నిలబడడమే పని.

మరి తలుపు తెరుచుకు నిలుచోడం బాగుండదు కనుక. ఆ సమయంలో నాకు మరే రాచకార్యాలు లేకపోవడంతో కొత్తగా ఏర్పడిన ఈ పనే ముఖ్యమయిన పనయిపోయింది.

ఆ అమ్మాయిగాక ఆ ఇంట్లో మరో ముసలామె కనబడుతున్నది. ఎప్పుడైనా ఒక్కసారి బయటకు వచ్చి అటూ ఇటూ చూచి లోపలకు వెళ్తుంటుంది.

నేను తొమ్మిది దాటిన తరువాత నా గదిలో నుండి బయటపడతాను. నడుచుకుంటూ వెళ్లి చిక్కడపల్లి సెంటర్లో వున్న స్వరాజ్య హోటల్లో భోజనం చేసి కాస్త ముందుకు నడుచుకుంటూ వెళ్లి బస్సెక్కితే మా ఆఫీసు దగ్గర దిగడానికి పావుగంట పడుతుంది.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వస్తూనే గేటు లోపల కాలుపెట్టకుండానే తలెత్తి ఎదురు మేడమీదకు చూసాను.

మెరుపు!

బాల్కనీలో కొత్తగా తెప్పించి వరసగా పెట్టిన చిన్న చిన్న పూలకుండీలలో నీళ్లు పోస్తోంది.

కొద్దిగా వంగి బక్కెట్‌లో నీళ్లు మగ్‌తో ముంచి పోస్తున్నప్పుడు ఆమె పొడవైన జడ ముందుకు జారి వేలాడుతూ ఆమెకు మరింత అందాన్ని ఇస్తోంది. పమిట అస్తవ్యస్తమయి చూపరులను మరింత మత్తెక్కిస్తోంది.

మనుష్యులని ఎంతగా ఆకర్షిస్తున్నదీ అంటే నేను నా గది తలుపుకున్న తాళాన్ని తీయడానికి నాకు పది నిముషాలపైన పట్టింది.

నేను బొమ్మలా ఆమెను అలాగే చూస్తుండిపోయాను.

అలా చెట్లలో నీళ్లు పోస్తూ పోస్తూ ఎందుకో తలెత్తి నావంక చూసినప్పుడు నేను ఉలిక్కిపడ్డట్టుగా మొహం తిప్పుకుని గది తాళం తీశాను.

ఆ అమ్మాయి కళ్లార్పకుండా బొమ్మలా తననే చూస్తున్న నా గురించి ఏమనుకుంటుందో?

అదే అమ్మాయిలతో వచ్చిన చిక్కు. మొగవాళ్లని మత్తెక్కించే ఆ రూపాలు. వాళ్లనీ, వాళ్ల అందాలనీ చూడకుండా వుండలేము. అలా చూస్తున్నప్పుడు వాళ్లు గమనిస్తే పట్టుబడిన దొంగలా మన స్థిమితాన్ని కోల్పోవడం...

కోరికలను నిలవరించలేని వయస్సు. దృఢమైన శరీరంలో చంచలమైన మనస్సు. ఎంతటి నిగ్రహపరుడైనా అందమైన ఆడదాని ఆహ్వానాన్ని తిరస్కరించగల శక్తిమంతుడు అవుతాడని నేననుకోను.

అదే అయింది నా విషయంలోనూ.

తలుపుకు తీసిన తాళాన్ని లోపలివైపు గడియకు తగిలించి మరోసారి తలెత్తాను.

ఆమె నావంకే చూస్తోంది. అంతే కాదు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తూ చిన్నగా నవ్వింది.

నాలో తత్తరబాటు ఆమెకు స్పష్టంగా కనబడిందేమో పెద్దగా నవ్వేసి చటుక్కున లోపలకు వెళ్లిపోయింది.

నేను తలుపును దగ్గరకు వేసాను. చొక్కా విప్పి హ్యాంగర్‌కు తగిలించి కూజాలో నీళ్లు వంపుకుని గడగడా త్రాగాను. బాత్రూంలోకి వెళ్లి నీళ్లతో ముఖం కడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ ఉత్సుకతతో కిటికీలో నుంచి ముందు మేడవైపు చూశాను.

కిటికీలోంచి నావైపుకే చూస్తున్న ఆమె నేను అటు చూడగానే నావైపుకు చేయి ఊపింది.

నా మొఖంలో కలవరపాటు.

అదొక అర్థంకాని అయోమయ అవస్థ.

ఆమె చొరవ నాకు చాలా విచిత్రంగా తోచింది. ఆమె ఉద్దేశ్యమేమిటో నాకు అర్థం కావడంలేదు. పరిచయంలేని నాతో అలా ప్రవర్తిస్తున్నదీ అంటే?

కానీ నాలో అటు చూడకుండా వుండలేని తపన.

కోరికలను నిలవరించలేని వయస్సు. దృఢమైన శరీరంలో చంచలమైన మనస్సు. ఎంతటి నిగ్రహపరుడైనా అందమైన ఆడదాని ఆహ్వానాన్ని తిరస్కరించగల శక్తిమంతుడు అవుతాడని నేననుకోను.

నిజంగా ఆమె అప్సరస. అందులో సందేహంలేదు.

నా అందమూ నలుగురు అనుకునేలా తక్కువదేమీ కాదు. అదే ఆమెను ఆకర్షిస్తున్నదేమో నాకు అర్థం కావడంలేదుగానీ ఆమె నాతో స్నేహం చేయడానికి ఉవ్విళ్లూరుతున్నదన్నది ఆమె చేష్టల్లో స్పష్టంగా కనబడుతున్నది.

కొన్నివందల గజాల దూరం నుండే కనబడుతున్న ఆమె నన్ను ఆమెవైపుకు అయస్కాంతంలా లాగుతుండగా నేనేం చేయాలో తెలియనట్లుగా ఆమెనే చూస్తుండిపోయాను.

ఆఫీసులో ఆడపిల్లలు మాట్లాడడం వేరు. ముక్కూ మొహం తెలియని అందమైన ఆడపిల్ల చేతులూపి మరీ ఆహ్వానించడం వేరు.

ఇలాంటి విషయాల్లో మరొకరి సలహా తీసుకోవాలన్నా సిగ్గుగానే వుంటుంది.

ఆ సాయంత్రం మా వీధి మొదట్లో వున్న బేకరీలో బ్రెడ్ కొనుక్కుందామని మెట్లెక్కుతున్నప్పుడు ఆ బేకరీ మెట్లు దిగుతున్న ఆ మెరుపును అంత దగ్గరగా చూస్తూ కలవరపడ్డాను.

బిస్కెట్ ప్యాకెట్లున్న చేయెత్తి 'హలో' అన్నట్లుగా

పెదాలు కదిలించింది.

నేను తడబడ్డ మాట వాస్తవం.

''నా ఊహ నిజమయితే మా ఇంటి ఎదురుగా వున్నది మీరే కదూ?'' పెదాలు వంకర తిప్పి కిసుక్కున నవ్వింది. ఆమె కళ్లు మూసి తెరిచింది. ఆమె కనురెప్పలు ఓ పొడవాటి పడవలా వంకర తిరిగి ఆమె ముఖానికి ఓ వింత అందాన్ని చేకూరుస్తున్నాయి. నవ్వుతున్నప్పుడు ముత్యాల్లా మెరుస్తున్న తెల్లని పలువరస. కొనతేలిన ముక్కు. పెద్ద పెద్ద కళ్లు. ఎర్రటి మొఖం మీద కాస్త పొడుగ్గా దోసగింజంత బొట్టు. ఒక్కసారి చూస్తే మరచిపోలేని రూపం.

నాకు నోట మాట పెగలడంలేదు.

''మీరు కొనేవేవో తొందరగా కొంటే మీతోపాటు స్కూటర్‌మీద నేనూ ఇంటికి వచ్చేస్తాను.''

ఇలాంటి అనుభవం కొత్త.

లక్ష కోరికలు వుండవచ్చు.

ఎన్నో మధుర క్షణాల్ని స్వాప్నిక జగత్తులో రూపొందించుకోవచ్చు. కానీ వాటిని నిజ జీవితంలో ఆచరణలో పెట్టగలిగే క్షణాలు వస్తే ఎలా ప్రవర్తించాలో అర్థంగాని తపన.

ఆమె నవ్వు నామీద ఉసికొలుపుతున్న బాణంలా వున్నది.

చటుక్కున లోపలకు వెళ్లి బ్రెడ్ తీసుకుని

బయటకు వచ్చాను.

''నన్ను మీతోపాటు తీసుకువెళుతున్నారా లేదా?'' కళ్లు పైకెత్తి విల్లంబులా నుదురు ముడివేసి అడిగింది.

అంత అందమైన ఆడపిల్ల స్కూటర్‌మీద వెనుక కూర్చుంటాను అంటే ఎంత జడుడైనా కాదని ఎలా అనగలడు?

''నేను మీ ఇంటి ఎదురుగా వుంటానని మీకెలా తెలుసు?'' కావాలనే అడిగాను.

''మీకు అందమైన ఆడపిల్లలు ఎలా గుర్తుంటారో... మాకూ అందమైన మొగవాళ్లు అలాగే గుర్తుంటారు'' మరోసారి కిసుక్కున నవ్వింది.

స్కూటర్ స్టార్ట్ చేశాను.

వెనుక ఆమె ఎక్కుతూ ''మామూలుగా కూర్చోవచ్చా? దూరంగా కూర్చోవాలా?'' అన్నది.

ఆమె గొంతులో స్పష్టంగా నాకు ఎగతాళి కనిపిస్తోంది.

''మీ ఇష్టం''

నీళ్లలో మునగకూడదు. మునిగిం తరువాత చలికి వెరవకూడదు. ఇక లోకుల సంగతా? జానేదో...

''థాంక్యూ''

దూరంగానే కూర్చున్నది. పోతున్నప్పుడు దగ్గరకు జరుగుతుందేమో నాకు తెలియదు.

''మీరు ఏం చేస్తుంటారు?''

''ఎమ్మే సైకాలజీ అయిపోయింది. ప్రస్తుతం ప్రాక్టికల్స్‌లో వున్నాను''

''అంటే?''

''అంటే ప్రస్తుతం మనుష్యులను చదవడమే నా పని'' నాకు కనపడకపోయినా ఆమె నవ్విందని నాకు అర్ధమయింది.

ఒక్క క్షణం ఇంత అందమైన అమ్మాయి మెంటల్ అయి వుండదు కదా అనే అనుమానం వచ్చింది. భయపడ్డాను.

హైదరాబాద్ రోడ్లమీద అస్తవ్యస్తంగా నడుస్తున్న మనుష్యులనీ, కార్లనీ, ఆటోలనీ, స్కూటర్లనీ ఛేదించుకుంటూ నేను ముందుకు దూసుకుపోతున్నాను, నా ప్రజ్ఞాపాటవాలన్నిటినీ ఉపయోగించి.

ఒక్క ఆఫీసుకే అయితే బండిని బయటకు తీయను. ఇవ్వాళ దిల్‌సుక్‌నగర్‌లో రామం దగ్గరకు వెళ్లడానికని స్కూటర్ తీశాను.

రామం నా చిన్ననాటి స్నేహితుడు.

ఏమైతేనేం మెరుపుతో



పరిచయమవడానికి అది దోహదం చేసింది.

''వచ్చిన చుట్టాలంతా వెళ్లినట్టున్నారు?''

''నన్ను బాగానే అబ్జర్వ్ చేస్తున్నారన్నమాట''

ఆమెకు కనబడకపోయినా చిన్నగా నవ్వాను.

''ఎదురు ఇల్లేకదా?'' దాంట్లో పెద్ద ప్రత్యేకత లేదన్నట్లుగా అన్నాను ''అవునూ ఆ పెద్దాయన మీ తండ్రా?''

''అవును. అందుకే వెళ్లగొట్టేశాను''

''అదేమిటి?''

''అ ఛండాలుడంటే నాకు పరమ అసహ్యం కనుక''

★★★

నేను బ్రేకును బలంగా తొక్కడంతో తూలి నా భుజం మీద వాలిపోయింది సరోజ.

అప్పుడు సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట అయింది.

ఉడ్‌లాండ్స్‌లో భోజనం చేసి ఏదైనా మ్యాట్నీకి వెళ్దామా అన్నట్లు బయలుదేరాం.

అది సరోజతో పరిచయమైన మూడోరోజు.

వంకర తిరిగివున్న ఆ పొడుగాటి కనురెప్పల వెనగ్గా వున్న అందమైన కళ్లను చూస్తుంటే నన్ను నేను మరచిపోతున్నాను.

దేవుడు ఓ దేవతను సృష్టించి నా అదృష్టం కొద్దీ నాముందు వదిలేసాడా అన్నట్లుగా ఆమె ముఖంలోకి చూస్తూ కాలాన్నే మరచి తన్మయత్వం చెందుతున్నాను.

''సినిమాకు వెళ్లాలనే వున్నది. ఆ చీకట్లో తెరమీద కనబడే కృత్రిమ అందాల్ని చూస్తూ కూర్చునే దానికంటే పచ్చని చెట్ల నడుమ ఇందిరా పార్క్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకోవడం ఆనందంగా వుంటుందికదా'' అన్నాను.

''నాకు ఆ వెధవ బోడి కబుర్లంటే ఇష్టం వుండదు''

''ఏం?'' అన్నాను ఓ కిళ్లీ కొట్టు ముందు స్కూటర్ ఆపుతూ రెండు కిళ్లీలు తీసుకుందామని.

''ఏముంటాయి మన మధ్య కబుర్లు. మీదే ఊరు అంటారు. మీరు ఎంతవరకు చదివారు అంటారు. మీరేదైనా ఉద్యోగం చేస్తున్నారా అంటారు. మీకు అన్నలెంతమంది, తమ్ముళ్లు ఎంతమంది అంటారు. అక్కాచెల్లెళ్లు ఎంతమంది అంటారు. మీ ఇష్టాలేమిటి అంటారు. ఆ ప్రశ్నలకు నా సమాధానాలమీద మరిన్ని చిలక్కొట్టుడు ప్రశ్నలు... ట్రాష్. అర్ధంలేని ప్రశ్నలు. అర్ధంలేని సమాధానాలు. అంతేగా. హాయిగా ఏ ఫైటింగ్ సినిమాకో వెళ్లాం అనుకోండి. దాన్ని మనం ఎక్కడి నుంచి ఎక్కడిదాకా చూసినా సినిమా అర్ధం కాలేదనే ప్రశ్నే వుండదు. పాటలంటారా! ఇప్పుడు మనం చెవులు కోసుకునేటంత మంచి పాటలేం రావడంలేదుకదా మిస్ అయిపోతాం అనుకునేందుకు'' గుక్క తిప్పుకోకుండా అనేసి ఫక్కున నవ్వింది.

కిళ్లీ కట్టించుకుని ఆమెకొకటి ఇస్తూ ''ఓకే... ఓకే'' అని స్కూటర్ స్టార్టు చేశాను.

సినిమా హాల్లోకి వెళ్లి గంట కూడా కూర్చోలేదు. ''నాకు

ఆమెనే అడగండి

రోజా, సెల్వమణిల ప్రేమకథ అందరికీ తెలుసు. ఇద్దరూ కలిసి మరీ మేము ప్రేమించుకుంటున్నాం, త్వరలోనే పెళ్లి కూడా చేసుకుంటాం అని ప్రకటించారామధ్య. ఈ విషయంలో మళ్లీ ఇంతదాకా ఎలాంటి కదలికా కనిపించడం లేదు. ఇటీవల సెల్వమణి దగ్గర ఓ విలేఖరి ఈ ప్రస్తావనే తీసుకువచ్చాడు. 'రోజాతో మీ పెళ్లెప్పుడు?' అని అతనడిగిన ప్రశ్నకు- సెల్వమణి నవ్వుతూ 'ఈ సంగతిని ఆమెనే అడగండి' అంటూ జవాబిచ్చాడు. ఈ మాటల్లో అసలు సంగతి ఏమైవుంటుందో? అందరి ఊహలకి అతడు వదిలేశాడనుకుందామా? లేక పెళ్లి విషయంలో ఆలస్యం రోజావల్లనే అవుతోందని అంటున్నాడా? లేక 'సిగ్గు' ఎక్కువైపోయి అలా అన్నాడా? అని సినీ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు!

-జె.ఎం.

తలనొప్పిగా వున్నది'' అంటూ నసుగుడు మొదలుపెట్టింది.

''అయితే తరువాతది నా సలహానే. నేను ముందే చెప్పానా హాయిగా పచ్చగడ్డిలో కూర్చుని కబుర్లు చెప్పుకుందామని''

''ప్రతిదాంట్లోనూ మొగవాడి మాటే చెల్లుతుందని ఆ మొగ పక్షపాతి దేవుడు ఎప్పుడో రాసిపెట్టాడు. ఏం చేస్తాం పదండి''

ఇంటర్వెల్‌లో ఇద్దరం బయటపడి ఇందిరా పార్కులో చెట్టు కింద చేరాం.

''ఒక్కటి చెప్పండి నాకు... మీ వాళ్లనందరినీ వెళ్లగొట్టానంటున్నారుకదా. మీరూ ఆ ముసలమ్మే అంత పెద్ద ఇంట్లో వుంటున్నారుకదా. ఉద్యోగపు వేటా? ఏం చేయాలని ఇక్కడ?'' గడ్డిలో కూర్చుంటూ ఆమెనే చూస్తూ అడిగాను.

ఆమె కళ్లను ఒక్కసారి అటూ ఇటూ తిప్పి వెనకపక్కగా నడుం కిందుగా చీర ఒక పొరను పైకి లాగి గడ్డిలో కూర్చుంటూ ''నేను చేసింది సైకాలజీ అన్నానుకదా. లైఫ్ ఎంజాయ్ చేస్తూ మనుష్యుల్ని చదివేయాలని'' అన్నది.

''బాగా ఆస్తిపరులన్నమాట?''

''నా అందమే నా ఆస్తి. నా ఆస్తిని చూస్తూ మీ ఆస్తిని కరిగించుకుంటుంటే నేను ఆనందిస్తుంటాను'' పకపకా నవ్వింది నలువైపులా చూస్తూ.

ఆ సమయంలో మా చుట్టుపక్కల అంతా మనుష్యులు లేకపోవడం కొంతవరకు నా అదృష్టం.

ఆమె నవ్వు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఇబ్బందిగా అటూ ఇటూ చూస్తూ ఉండిపోయాను.

''బయలుదేరండి. జనంలేని ఈ పార్కులో మాత్రం ఎంతసేపు ఈ చప్పు కబుర్లతో ఒకళ్లనొకళ్లం చూసుకుంటూ కూర్చుంటాం. మా ఇంటికి వెళ్లి హాయిగా గంటల్ని నిముషాల్లా గడిపేద్దాం పదండి'' అంటూ లేచి నిలబడి నేను నిలబడడానికి తన చేతినందించింది.

నేను ఆ అవకాశాన్ని జారవిడుచుకోలేనట్టుగా నా చేతిని అందిస్తూ ఆమెను నావైపుకు లాగుతూ నిలుచుకున్నాను.

స్కూటర్ స్టార్టు చేసిన తరువాత వెనకాల కూర్చుని నా భుజం మీద చేయి వేసి లోయర్ ట్యాంక్‌బండ్‌మీదకు మలుపు తిరుగుతుండగా ''మీరు నన్ను ఇక్కడే వదిలేసి వెళ్లనూ అంటే నీకో నిజం చెబుతాను'' అన్నది.

''చెప్పండి''

''మీరు ఏదో వట్టి కబుర్లకోసం నన్ను ఎప్పుడూ ఈ స్కూటర్‌మీద అక్కడకూ ఇక్కడకూ తిప్పవద్దు. ఎంజాయ్ చేయాలీ అనుకుంటే ఓ పోష్ హోటల్లోనో మంచి రూం బుక్ చేయండి. జేబునిండా డబ్బులు వేసుకురండి. లేదా మీకూ నాకూ కూడా టైం వేస్టు. ఎందుకీ దండగ తిరుగుళ్లు'' చాలా సూటిగా అన్నది.

ఓ అందమైన బొమ్మమీద ఎవరో వాంతి చేసుకున్నంత వికారమేసింది నాకు.

సరాసరి స్కూటర్‌ను ఆమె ఇంటిముందు ఆపి ''గుడ్‌నైట్'' అంటూ ఆమె దిగీ దిగగానే నేను నా బండిని ముందుకు ఒక్క దూకు దూకించాను.

★★★

నాలుగురోజుల తరువాత ఓ ఉదయం ఏడుగంటలప్పుడు తలుపు చప్పుడయితే ఎవరా అన్నట్లు వెళ్లి తలుపు తీశాను.

ఎదురింటి మేడమీద ముసలమ్మ. సరోజకు తోడూ, నీడా, రక్షకురాలు!

మొఖం చిట్లిస్తూ చూశాను- ఏమిటి అన్నట్టుగా.

-ఆరోజు సరోజను స్కూటర్‌మీద తీసుకు వచ్చి ఆ యింటి ముందు దించిన తరువాత మళ్లీ ఆమె వైపుకే కాదు- ఆ యింటివైపుకే నేను తలెత్తి చూడలేదు.

''మిమ్మల్ని అమ్మాయి ఒక్కసారి రమ్మనమన్నది''

''దేనికి?'' విసుగ్గా అడిగాను.

''తెలియదు''

''నాకు ఇప్పుడు వీలుపడదు. నేను ఆఫీసుకు వెళ్లే హడావుడిలో వున్నాను'' చాలా నిర్లక్ష్యంగా అన్నాను.

''నాతల్లి మూడు రోజులబట్టీ ఏమీ తినటం లేదు. ఎందుకో కుళ్లి కుళ్లి ఏడుస్తున్నది... మిమ్మల్ని ఎట్లాగయినా ఓ పది నిముషాలు వచ్చి వెళ్లమంటున్నది!'' ఆమె బతిమలాడుతున్నట్టుగా అన్నది.

''చూస్తానులే... వీలున్నప్పుడు!'' అది సభ్యత కాకపోయినా ఇక ఆమెతో మాట్లాడడం ఇష్టం లేదన్నట్టుగా తలుపులేశాను.

నేను కావాలనే వెళ్లలేదు.

పది నిముషాలు తీరిక చేసుకోలేక కాదు.. అలాంటి ఆడవాళ్లంటేనే నాకు పరమ అసహ్యం... వాళ్లతో నాకు మాటలేమిటి? ఛ..ఛ..డబ్బుకోసం జీవితాన్నే నాశనం చేసుకునే వాళ్లు ఎంతకైనా తెగిస్తారనటంలో అబద్ధం లేదు.

కానీ ఆ ముసలమ్మ నన్ను వదలలేదు.

రాత్రి హోటల్లో భోజనం చేసి యింటికి వచ్చి తలుపుకున్న తాళం తీస్తుండగానే గేటు నెట్టుకుంటూ లోపలకు వచ్చింది.

''ఏమిటి?''

''సరోజ మిమ్మల్ని ఒక్కసారి వచ్చివెళ్లమంటున్నది'' అన్నది. ''మీరు రాకపోతే అది అన్నం ముట్టేటట్టు లేదు''

''అదేవిటి...నా రాకకూ, ఆమె అన్నం తినటానికీ సంబంధమేమున్నది''

''నాకేం తెలుస్తుంది చెప్పండి...దాని ఉద్దేశ్యాలేమిటో నేను కనిపెట్టగలిగాను కాబట్టి మీకు చెబుతున్నాను!'' ఆ క్షణాన ఆమె కంఠం కొద్దిగా కరుకుగా వున్నట్లనిపించగా నాలో కోపం చివ్వున పైకి తన్నింది.

తీస్తున్న తాళాన్ని మళ్లీ వేసేసి, గేటును దగ్గరకు లాగి, విసురుగా పెద్ద పెద్ద అడుగులతో ఎదురింటి మేడమీదకు వెళ్లాను.

ఎంత కోపంగా మెట్లెక్కానో, సరోజను చూచిన మరు క్షణంలో అంతగా నీరసించిపోయాను.

రెండు రోజుల్లోనే ఆమె చిక్కి శల్యమయింది.

మొఖంలో ఆ నిగారింపు లేదు. కళ్లల్లో వెలుగులేదు. పడవలా వంకర తిరిగి వుండవలసిన ఆ కనురెప్పలు లోపలకుపోయి కనుగుడ్లమీద తడిగుడ్డ కప్పినట్టుగా జారి వున్నాయి.

- మిగతా వచ్చేవారం★

ట్వింకిల్ కసి

ఆవుపాలంలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా? డింపుల్ కపాడియా పెళ్లయ్యాక, సన్నీ డియోల్‌తో తిరిగితే, ట్వింకిల్ ఖన్నా పెళ్లికి ముందే గట్టూ కపూర్‌తో డేటింగ్ మొదలెట్టింది. ఏ విలేఖరైనా ఆమెని గట్టూతో ప్రేమాయణం గురించి అడిగితే- 'ఆ విషయం గురించి నేను మాట్లాడను' అని నిర్మొహమాటంగా చెప్పేస్తూంటుంది. ట్వింకిల్ ఒక వైపు గట్టూతో ప్రేమాయణం సాగిస్తూనే అజయ్‌దేవగన్‌తో రాసుకుపూసుకు తిరుగుతోందట. అది తెలిసి కాజోల్ అజయ్ నిర్మాతలను ట్వింకిల్‌ని అజయ్ చిత్రాల్లో బుక్ చేయొద్దని బెదిరిస్తోందట. ఈ సంగతి గురించి ప్రశ్నిస్తే మాత్రం ట్వింకిల్ వెంటనే -'కాజోల్‌కి అజయ్ మీద నమ్మకంలేదు. అందుకే ఆమె అతడి సరసన ఏ హీరోయిన్ నటించినా అనుమానిస్తూ వుంటుంది. అజయ్‌కి కాజోల్‌ని చూస్తే భయం. అయినా అనుమానాలతో, భయాలతో ఎంతకాలం కాపురం చేయగలరు? ఆ జంటను చూస్తే నాకు జాలేస్తుంటుంది' కసితోనైతేనేం ట్వింకిల్ మంచి స్టేట్‌మెంటే ఇచ్చింది కదూ?

-జె.వి.బాబు